

కొమ్మ ఊగిందా.. కరెంట్ గోవిందా...
7లో..
సర్వీసు రూల్స్ రూపొందించి పదోన్నతులు కల్పించాలి

ప్రభుత్వ భవనంలో ప్రైవేట్ కార్యకలాపాలు



వ్యాపారి ఉపయోగిస్తున్న ప్రభుత్వ భవనం



సామగ్రిని ఆరబెట్టేందుకు వేసిన ఫ్యాన్



భవనంలో ఆరబెట్టిన ఉల్లిగడ్డ

- యథేచ్ఛగా సొంత పనులకు వినియోగం
- భవనం ఎదుట అక్రమంగా వెలిసిన దుకాణాలు
- దుకాణాలకు విద్యుత్ సరఫరా భవనం నుంచే
- ఓ వ్యాపారి ఇష్టారాజ్యం

మంచిర్యాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అది ఓ ప్రభుత్వ భవనం. మంచిర్యాల జిల్లా కేంద్రంలో నడిబొడ్డున ఉన్న ఆ భవనంలో జిల్లా వెల్ఫేర్ కార్యాలయం ఉండేది. కొంతకాలంపాటు సఖి కేంద్రంగానూ ఉపయోగపడింది. అంతకు ముందు బాలసదన్ పేరిట అనాథ బాలికల సంక్షేమ వసతి గృహంగా సేవలు అందించింది. మార్కెట్ ఏరియాలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు సమీపంలో ఉండి, రైల్వే స్టేషన్, బస్టాండ్‌కు కూతవేటు దూరంలో ఉండటంతో ప్రభుత్వ కార్యకలాపాలకు వినియోగించేవారు. జిల్లాల పునర్విభజన అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలను సమీకృత కలెక్టరేట్ భవనంలోకి మార్చడంతో జిల్లా వెల్ఫేర్ కార్యాలయాన్ని కూడా అక్కడికి తరలించారు. సఖి కేంద్రాన్ని సైతం కాలేజీ రోడ్డులోని నూతన భవనంలోకి తరలించారు. దీంతో సుమారు రెండు సంవత్సరాలుగా అప్పటి బాలసదన్ భవనం నిరుపయోగంగా ఉండటంతో ప్రైవేటు వ్యక్తుల కళ్లు దానిపై పడ్డాయి.

అధికారుల ప్రోత్సాహంతోనే

బాలసదన్ భవనం ఖాళీ చేసినప్పటి నుంచి దాదాపు రెండు సంవత్సరాలుగా దాని తాళాలు ఓ వ్యాపారి దగ్గరే ఉండటం గమనార్హం. భవనం తాళాలు వ్యాపారి దగ్గర ఉండటానికి సంబంధిత అధికారుల ప్రోత్సాహం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. వ్యాపార కార్యకలాపాలకు ప్రభుత్వ భవనం, విద్యుత్, నీటిని వాడుకుంటున్న వ్యాపారి మరో అడుగు ముందుకేశాడు. ప్రభుత్వ భవనం ప్రహరీని ఆనుకొని ఏకంగా ఓ షెడ్డును నిర్మించాడు. అందులో నిత్యావసర సరుకులు విక్రయిస్తున్నాడు. షెడ్డుకు ఇరువైపులా తాను ఏర్పాటు చేసిన మరో రెండు చిరు వ్యాపారుల దుకాణాలు కూడా ఉన్నాయి. నిత్యావసర వస్తువుల షాపుతోపాటు సమీపంలోని రెండు దుకాణాలకు కూడా ప్రభుత్వ భవనం నుంచే విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తున్నాడు. ప్రభుత్వ భవనంతోపాటు దాని ముందు ఏర్పాటు చేసిన షెడ్లు, విద్యుత్ సౌకర్యానికి పైసా చెల్లించకుండానే రెండు చేతులా సంపాదిస్తున్నాడు. భవనం నుంచి షెడ్ల వరకు ఏర్పాటు చేసిన విద్యుత్ వైరును పైపులో అమర్చడంతో ఎవరి దృష్టి దానిపై పడటం లేదు. మార్కెట్ ఏరియాలో వ్యాపారస్తుని షెడ్లను ఆనుకొని ఉన్న పలు దుకాణాలకు వాటిలో చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు నెలవారీ అద్దెలు చెల్లిస్తున్నారు. ఒక్కో షాపు రూ.10వేల వరకు అద్దెలు వసూలు చేస్తుండగా, ఏకంగా ప్రభుత్వ భవనాన్ని సొంత పనులకు వాడుకుంటూ, దాని ముందు షెడ్లకు కూడా ఎలాంటి కిరాయి చెల్లించకపోయినా పట్టించుకునేవారు కరువయ్యారు. రాజకీయ అండదండలున్న సదరు వ్యాపారి ఈ వ్యవహారంపై ప్రశ్నించిన వారిని బెదిరింపులకు గురి చేస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో వ్యాపారిపై ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదని సమాచారం.

వ్యాపార లావాదేవీల కోసం

భవనం ఖాళీగా ఉండటంతో ఓ వ్యాపారి దాన్ని తన లావాదేవీల కోసం వినియోగిస్తున్నాడు. భవనం తాళాలు చేజిక్కించుకున్న సదరు వ్యాపారి తన బిజినెస్‌కు సంబంధించిన వివిధ రకాల సామగ్రిని భద్రపరిచే గోదాంగా ప్రస్తుతం వాడుకుంటున్నాడు. ఉల్లిగడ్డలు, ఇతర నిత్యావసర వస్తువుల వ్యాపారానికి సంబంధించిన సామగ్రినంతటినీ అందులో ఆరబెట్టడమే గాకుండా అవి చెడిపోకుండా ఉండేందుకు భవనంలోని సీలింగ్ ఫ్యాన్లు వినియోగిస్తున్నాడు. ఇందుకు అవసరమైన విద్యుత్‌ను భవనం నుంచే అక్రమంగా వాడుకుంటున్నా అడిగేవారు కరువయ్యారు. గృహావసరాలకు వినియోగించే విద్యుత్‌కు నెలవారీ బిల్లులు చెల్లించకుంటే కనెక్షన్ తొలగించే విద్యుత్‌శాఖ అధికారులు ప్రభు త్వ భవనానికి కొన్నేళ్ళుగా విద్యుత్ బకాయి ఉన్నా చర్యలు చేపట్టక పోవడంపై విమర్శలకు దారితీస్తోంది. జిల్లా వేల్ఫేర్ కార్యాలయాన్ని ఖాళీ చేసిన సంబంధిత అధికారులు అనంతరం భవనాన్ని విస్మరించడంతో అది ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లింది. నిత్యం రద్దీగా ఉండే మార్కెట్ రోడ్డులో పగలూ, రాత్రి ప్రభుత్వ భవనం తెరిచి ఉండటం, అందులో లైట్లు వెలుగుతున్నప్పటికీ అధికారుల దృష్టికి రాకపోవడం అనుమా నాలకు తావిస్తోంది.

దృష్టికి రాలేదు

స్వరూప, జిల్లా ఇన్‌చార్జి వెల్ఫేర్ అధికారి

బాలసదనం భవనాన్ని ప్రైవేటు వ్యక్తులు వ్యక్తిగత కార్యకలాపాలకు వినియోగిస్తున్న విషయం నా దృష్టికి రాలేదు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులకు సమాచారమిచ్చి, పూర్తిస్థాయిలో విచారణ జరుపుతాం. అక్రమంగా భవనాన్ని, అందులోని విద్యుత్‌ను సొంత అవసరాలకు వినియోగిస్తున్న వ్యాపారిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

నియామక పత్రం అందజేత



వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న నేతలు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 25: ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా కొత్త వెంకటేశ్వర్లు ఇటీవల నియామకం కాగా ఆదివారం హైదరాబాద్‌లోని ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరావతి లక్ష్మీ నారాయణ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం వెంకటేశ్వర్లును సన్మానించారు. మహాసభ ఉపాధ్యక్షుడు నల్మాసు కాంతయ్య, రాష్ట్ర కార్యదర్శి ముక్త శ్రీనివాస్, మాజీ జిల్లా అధ్యక్షుడు రేణికుంట్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ ఐకాన్ అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న విష్ణువర్ధన్‌రావు

ఏసీసీ, ఆగస్టు 25: మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన విద్యావేత్త రాపోలు విష్ణువర్ధన్‌రావు ఎడ్యుకేషన్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్ 2024 పురస్కారం అందుకున్నారు. ఆదివారం హైద్రాబాద్‌లోని పార్కు హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును యూనివర్శల్ మెంటర్స్ అసోసియేషన్ వారు ప్రదానం చేశారు. విష్ణువర్ధన్‌రావును డాక్టర్ శేఖర్ జైన్, యూనివర్శల్ మెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సందీప్ గులాటి, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు మదన్‌మోహన్‌లు అభినందించారు.

దండేపల్లి మండల ప్రెస్‌క్లబ్ కార్యవర్గం

దండేపల్లి,ఆగస్టు 25: దండేపల్లి మండల ప్రెస్‌క్లబ్ కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక పద్మశాలి భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కుంచె ప్రసాద్, అధ్యక్షుడిగా బండి రవిగౌడ్, ఉపాధ్యక్షులుగా బూసిరాజు రాజన్న, మెంగని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎడ్ల రాజన్న, కోశాధికారిగా మెదంపురం వెంకటేష్, కార్యదిర్శగా ఎండి షరీఫ్, సంయుక్త కార్యదర్శిగా హరీష్, ప్రచార కార్యదర్శిగా ఎనగందుల సత్యం, అధికార ప్రతినిధిగా చక్రపాణి, గౌరవ సలహాదారులు గోపతి శ్రీనివాస్, గాలిపెల్లి వెంకటపతి, అల్లంల కుమారస్వామి, బచ్చల సుబాష్, సద్దాంలను ఎన్నుకున్నారు.

ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

శ్రీరాంపూర్, ఆగస్టు 25 : శ్రీరాంపూర్ ఏరియాలో ఆదివారం ప్రాంతాల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, రాధ వేషధారణల్లో అలరించారు. యువకులు కాలనీలలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారుల వేషధారణ, నృత్యాలు ఆకట్టుకున్నాయి.

జిల్లాలో భారీ వర్షం

- ఎల్లంపల్లికి కొనసాగుతున్న వరద
- రైల్వే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఇండ్లలోకి చేరిన నీరు



ఇండ్లలోకి చేరిన వరద నీరు



సామగ్రిని బయటకు తీసుకువస్తున్న ప్రజలు, బాధితులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

మంచిర్యాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం భారీ వర్షం కురిసింది. శనివారం మధ్యాహ్నం నుంచి మొదలైన వర్షం రాత్రంతా కొనసాగింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉంది. కాసిపేట మండలం కొండాపూర్‌లో అత్యధికంగా 54.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా జన్నారం మండల కేంద్రంలో 39.5, కన్నెపల్లి మండలంలో 39.3, జన్నారం మండలం తపాల్‌పూర్‌లో 37.3, బెల్లంపల్లి మండలంలో 36.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

గుడిపేట సమీపంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 148 మీటర్లు కాగా ఆదివారం 146.56 మీటర్ల ఎత్తుకు నీరు చేరింది. ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 16.286 టీఎంసీల వరకు నీరు నిల్వ ఉంది. కడెం ప్రాజెక్టు నుంచి 7980 క్యూసెక్కులు, ఎగువన కురుస్తున్న వర్షాలకు 15,105 క్యూసెక్కుల నీరు ఎల్లంపల్లికి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి హైద్రాబాద్ మెట్రో పాలిటన్ వాటర్ స్కీంకు 312 క్యూసెక్కులు, పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులు, నంది పంప్ హౌజ్‌కు 6300 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

బెల్లంపల్లిలో ఇండ్లలోకి చేరిన నీరు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ఆదివారం మధ్యాహ్నం గంట సేపు భారీ వర్షం కురిసింది. పట్టణంలోని 11, 12 వార్డుల్లో ఇండ్లలోకి వరద నీరు చేరింది. మూడో రైల్వే ట్రాక్ పనులు జరుగుతుండగా కాంట్రాక్టర్ గోడ కట్టి పనులను కొనసాగించాడు. పనులు పూర్తి కావడంతో ముందస్తు చర్యలు చేపట్టకుండా ఆదివారం గోడను కూల్చివేశాడు. దీంతో నిల్వ ఉన్న నీరు ఒక్కసారిగా దిగువన ఉన్న ఇండ్లలోకి చేరింది. దాదాపు 20కి పైగా ఇండ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎలక్ట్రిక్ వస్తువులు, సరుకులు నీటమునిగాయి. రైల్వే కాంట్రాక్టర్ గోడను కూల్చివేయడంతో వరద నీరు ఇండ్లలోకి వచ్చిందని బాధితులు పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత బాధితులను పరామర్శించారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్ళి నష్టపరిహారం వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. ఎక్స్‌కావేటర్ సహాయంతో దారి మళ్లించారు.

మహిళలపై దాడులకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రగతి శీల మహిళ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 25: మహిళలపై దాడులకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు చేస్తామని ప్రగతి శీల మహిళ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ పేర్కొన్నారు. ఆదివారం మంచిర్యాలలోని మార్క్సభవన్‌లో సంఘం 7వ మహాసభలను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలపై దాడులు, అత్యాచారాలు, గృహహింస పెరిగిపోతుందన్నారు. వీటి నివారణకు ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు తీసుకురావాలన్నారు. శ్రామికశక్తిలో మహిళల భాగస్వామ్యం రోజురోజుకు తగ్గుతుందని, పలు రంగాల్లో పురుషులతో సమానంగా వేతనాలు పొందడం లేదన్నారు. ఆశా వర్కర్లుగా మధ్యాహ్న భోజనం కార్మికులు, అవుట్‌సోర్సింగ్, అంగన్‌వాడీ, కస్తూర్బా విద్యాలయాల్లో తదితర రంగాల్లో పనిచేస్తున్న మహిళలకు కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. మహిళ మల్లయోధుల మీద లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీ బ్రిజ్ భూష న్‌పై కేసు నమోదు చేయడానికి దేశ వ్యాప్తంగా పోరాటాలు చేయాల్సి వచ్చిందన్నారు. ఇంత పోరా డినా మల్లయోధురాలు తనకు తానుగా పోటీల నుంచి విరమించుకున్నట్లు ప్రకటించుకునే స్థితికి వచ్చిందన్నారు. అలాగే ఈ నెల 9న నైట్ డ్యూటీలో ఉన్న ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు, కఠినశిక్షలు తీసుకు రావాలన్నారు. సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి లాల్‌కుమార్, అరుణ, మంగ, శోభ, రాజకళ, అనిత, కృష్ణవేణి, మహేశ్వరి, పాల్గొన్నారు.

జ్వరాలతో బాధపడుతున్నా పట్టించుకోరా



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కోటపల్లి, ఆగస్టు 25: ప్రజలు జ్వరాలతో బాధపడుతుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోరా అని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. ఆదివారం పార్టీ నాయకు లతో కలిసి మండలంలోని కొల్లూరు గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో పలువురు జ్వరాలతో బాధపడుతుండగా వారితో మాట్లాడి బాధలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంకె రవి మాట్లాడుతూ కొన్ని రోజులుగా జ్వరాలతో ప్రజలు అల్లాడుతుంటే ప్రభుత్వం, అధికారులు ఏం చేస్తున్నారని, గ్రామంలోని పలు వురు కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులకు నాటు వైద్యం వాడు తున్నారన్నారు. ప్రభుత్వ వైద్యం అందకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం కొనుక్కోలేక ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారన్నారు. వెంటనే గ్రామంలో సబ్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. ఒక రోజు మెడికల్ క్యాంపు నిర్వహించడం సరికాదని, వారి ఆరోగ్యం బాగుపడేంత వరకు మెడికల్ క్యాంపు నిర్వహించాలని, గ్రామంలో అపరిశుభ్ర వాతావరణం ఉన్నందున బ్లీచింగ్ పౌడర్ చల్లించి, క్లోరినేషన్ చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బోడెంకి చందు, ఉమారాణి, నాగజ్యోతి, సమ్మక్క, నగేష్, చంద్రన్న, మధు, సత్యం, రాజన్న, యామిని, బానయ్య, తిరుమల్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆలయ పవిత్రోత్సవ పూజలు



స్వామి వ్రతం ఆచరిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

దండేపల్లి, ఆగస్టు 25: గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో పవిత్రోత్సవ ప్రత్యేకపూజలు రెండో రోజు ఆదివారం కొనసాగాయి. యాగ్నికులు అభిరామాచార్యులు, ఆలయ వంశపారం ముఖ్య అర్చకులు గోవర్ధన రఘుస్వామి, సంపత్‌స్వామి, వేద పండితులు దిద్దుళ్ళ నారాయణశర్మ, భరత్‌శర్మ పూజలను నిర్వహించారు. ఆదివారం సెలవు కావడంతో భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి సామూహిక వ్రతాలను ఆచరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండ ఏర్పాట్లు చేసినట్లు ఈవో శ్రీనివాస్ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పూజలు

మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కుటుంబ సమేతంగా సత్యదేవున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే కుటుంబసభ్యులకు తీర్థప్రసాదాలు, ఆశీర్వచనం అందజేశారు.

సేవలతోనే గుర్తింపు



ఏవో, ఏఈవోలను సన్మానిస్తున్న డీలర్లు

కోటపల్లి, ఆగస్టు 25: ఉత్తమ సేవలతోనే సమాజంలో గుర్తింపు పొందుతారని ఎరువులు, విత్తన డీలర్లు అన్నారు. మండలం నుంచి బదిలీ అయిన వ్యవసాయాధికారి మహేందర్, దేవులవాడ క్లస్టర్ ఏఈవో శేఖర్‌లకు ఆదివారం రైతువేదికలో ఎరువులు, విత్తనాల డీలర్లు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఏవో, ఏఈవోలు రైతులకు ఎంతో కాలంగా సేవ చేశారని, పంటలపై సూచనలు అందించారని తెలిపారు. కాసిపేట, బెల్లంపల్లి, లక్సెట్టిపేట ఏవోలు ప్రభాకర్, ప్రేమ్‌కుమార్, శ్రీకాంత్, కృష్ణ, ఏఈవోలు రాజ్‌కుమార్, వైష్ణవి, అనూష కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేష్ ప్రసాద్‌తివారీ, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, రైతులు, డీలర్లు పాల్గొన్నారు.

వైద్య శిబిరం



కొల్లూరులో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు అరుణశ్రీ

కోటపల్లి, ఆగస్టు 25: మండలంలోని కొల్లూరు గ్రామంలో ఆదివారం వైద్యురాలు అరుణశ్రీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని పలువురికి జ్వరాలు సోకగా జ్వరాల నియంత్రణ చర్యల్లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించి పరీక్షలు చేసి మందులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. జ్వర పీడితుల రక్తనమూనాలను సేకరించామని, జ్వరాలు అదుపులో ఉన్నాయన్నారు. పరిసరాల పరిశుభ్రత, దోమల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బీపీ మండల్ జయంతి



బీపీ మండల్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 25: పట్టణంలోని ఇక్బాల్ అహ్మద్‌నగర్‌లో ఆదివారం బీసీ ఐక్య కార్యా చరణ కమిటీ నాయకులు బీపీ మండల్ (బిందేశ్వర్ ప్రసాద్ మండల్) జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హక్కుల సాధన కోసం బీపీ మండల్ చేసిన కృషిని కొనియాడారు. నాయకులు మనోహర్, గుమ్ముల శ్రీనివాస్, నరెడ్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: మందమర్రి పట్టణంలోని మేడారం బస్టాండ్ వద్ద ఆదివారం బీసీ కుల సంఘాల ఐక్యవేదిక నాయకులు రిజర్వేషన్‌ల పితామహుడు బిందేశ్వర్ ప్రసాద్ మండల్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీలకు 27 శాతం విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్‌లు కల్పించడంలో ప్రధాన పాత్ర పోషించారని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పెద్దపల్లి సత్యనారాయణ, నాయకులు కొలిపాక రమేష్, కొమురయ్య, సత్యనారాయణ, శేసయ్య, సమ్మయ్య, మహేష్ పాల్గొన్నారు.



ఈనెల 29న బ్రహ్మాండమైన విడుదల


సుదర్శన్ 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
సంగీత 70 - ఆర్.సి.పురం | ఈశ్వర్ 70 - అత్తాపూర్
శ్రీలక్ష్మి/ఇంద్ర నాగేంద్ర - కుకట్‌పల్లి | శివశక్తి 70ఎంఎం - కొంపల్లి

అనాథ పిల్లలను ఆదుకుంటాం

● జిల్లా బాలల సంక్షేమ సమితి


పిల్లల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

ఇంద్రవెల్లి, ఆగస్టు 25: తల్లిని కోల్పోయిన, అనాథలైన కవల పిల్లలను అన్నివిధాలుగా ఆదుకుంటామని జిల్లా బాలల సంక్షేమ సమితి అధికారి రాజేంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని అందునాయక్ తండా గ్రామంలో శనివారం కవల పిల్లలను జన్మనిచ్చి మృతిచెందగా.. విషయం తెలుసుకున్న జిల్లా బాలల సంక్షేమ సమితి అధికారులు ఆదివారం అందునాయక్ తండా గ్రామాన్ని సందర్శించి తల్లిని కోల్పోయిన కవల పిల్లల ఆరోగ్య పరిస్థితి తెలు సుకున్నారు. పిల్లలను బాలల సంరక్షణ అధికారులకు అప్పగించాలని, అన్ని విధాలుగా ఆదుకుంటామని కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. తన భార్య దీక్ష కర్మకాండ కార్యక్రమం ఉంచి జిల్లా బాలల సంరక్షణ కేం ద్రానికి అందిస్తామని, అప్పటి వరకు తమ పిల్లల బాగోగులు తామే చూసు కుంటామని బాలల సంరక్షణ సమితి అధి అధికారులకు రాత పూర్వకంగా తండ్రి గోవింద్ రాసి ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తల్లిదండ్రు లను కోల్పోయి ఆనాధలైన ప్రతీఒక్క చిన్నారిని ఆదుకోవడానికి బాలల సంరక్షణ కేంద్రం అధికారులు సిద్దంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది అనిల్, కుటుంబ సభ్యులు, తదితరులు ఉన్నారు.

ఈ వారమే బ్రహ్మాండమైన విడుదల


దేవి 70 ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట
అంజలి 70ఎంఎం - సికింద్రాబాద్
RUSHIKESHWAR FILM 9849076540

నవ్వుల పండుగ... నేడే చూడండి
విజయవంతమైన 2వ వారం

దేవి 70 - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.30,6.00,9.00
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
విశ్వనాథ్ 70 - కూకట్‌పల్లి 11.45,2.45,6.45,9.45
రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15
సినీపోలిస్ - భాగ్యనగర్ 9.15pm
GEETHA FILM DISTRIBUTERS

ఈనెల 30న బ్రహ్మాండమైన విడుదల


SAB CREATIONS THRO PRK FILMS 9154578901 / 8919077130

ఈనెల 30న బ్రహ్మాండమైన విడుదల

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్
GANESH BHARI - 9296509333

ఈనెల 29న బ్రహ్మాండమైన విడుదల


SHIVA SAI FILMS

ఈనెల 30న బ్రహ్మాండమైన విడుదల


SHIVA SAI FILMS

అసంపూర్తిగా

సమ్మక్క సారలమ్మ భవనాలు


అసంపూర్తి ఉన్న సమ్మక్క, సారలమ్మ భవనం

మందమర్రిరూరల్, ఆగస్టు 25: పొదుపు సంఘాల మహిళల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో ప్రత్యేకంగా నిర్మించిన సమ్మక్క, సారలమ్మ భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. పొదుపు సంఘాల మహిళలు సమావేశాలు, ఇతర కార్యక్ర మాలు నిర్వహించుకునేందుకు గత ప్రభుత్వం ఒక్కో భవనానికి సుమారు రూ.16 లక్షల నుంచి రూ.18 లక్షల వరకు కేటాయించింది. మండలంలోని వెంకటాపూర్, సారంగపల్లి, శంకర్‌పల్లి, అందుగులపేట గ్రామాల్లో నిర్మాణంలో ఉన్నాయి. అందుగుల పేట భవనం 90శాతం పూర్తిఅయ్యింది. కాంగ్రెస్‌ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న సమ్మక్క సారలమ్మ భవనాలను పూర్తి చేయాలని పొదుపు సంఘాల మహిళలు కోరుతున్నారు.

కాలనీల్లో నిలుస్తున్న నీరు


పాల చెట్టు ఏరియాలో రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు

మందమర్రిటౌన్, ఆగస్టు 25: పట్టణంలోని కోల్ బెల్ట్ రోడ్డుతో పాటు పలు వార్డుల్లో ఎక్కడ పడితే అక్కడ వర్షం నీరు నిలుస్తోంది. రామన్ కాలనీ, రాజన్నలవాడ పాలచెట్టు నుంచి కేకే 5 బంగ్లాస్‌ఏరియా వరకున్న రోడ్డుపై వర్షం నీరు ప్రవహిస్తోంది. వర్షంకురిస్తే రోడ్డంతా జలమయంగా మారి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వరద నీరు ద్విచక్ర వాహనదారులపై పడడంతో ఇబ్బందులు పడుతున్నారు. వార్డుల్లో నీరు నిలిచి దోమలు, ఈగలు వృద్ధిచెంది వ్యాధుల బారిన పడు తున్నామని ప్రజలు పేర్కొంటున్నారు. డ్రైనేజీలు లేకపోవడంతో రోడ్డుపై మురుగు నీరు పారుతోందని పలువురు పేర్కొంటున్నారు. పోస్టాఫీసు కార్యాలయం సమీపంలో రోడ్డుపై గుంతపడి నీరు నిలిచిపోయి తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే పోలీస్‌స్టేషన్, కార్మెల్ స్కూల్ సమీపాల్లో వర్షం నీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైనేజీలను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.


జలపాతం అందాలను ఆస్వాదిస్తున్న పర్యాటకులు

జాలువారే కుంటాల అందాలు!

● జలపాతం వద్ద పర్యాటకుల సందడి

నేరడిగొండ, ఆగస్టు 25: మండలంలోని కుంటాల జలపాతం జాలు వారే అందాలను వొలకబోస్తున్నాయి. పర్యాటకులను ఎంతగానో ఆకట్టు కుంటుంది. కుంటాల జలపాతానికి వివిధప్రాంతాలనుంచి పర్యాటకుల సందడి మొదలయింది. దీంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. జాలువారే అందాలతో పర్యాటకులు మంత్రముగ్ధులవుతున్నారు. అటవి శాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లను చేపట్టారు.


బురదమయంగా మారిన ప్రాజెక్టుపైన ఉన్న రోడ్డు దుస్థితి

బురదమయంగా మత్తడివాగు రోడ్డు

తాంసి, ఆగస్టు 25: తాంసి మండలంలోని వడ్డాడి మత్తడి వాగు ప్రాజెక్టు ప్రధాన రహదారి దుస్థితి ఇది. దారి పొడవునా గుంతలు ఏర్పడి, అత్యంత ప్రమాదకరంగా మారింది. చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారి వాహనాలను అదుపు తప్పుతున్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టు జలకళను సంతరించుకోవ డంతో చుట్టూ పరిసరాలు చూసేందుకు దూర ప్రాంతాల నుంచి పర్యాట కులు వస్తున్నారు. వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఈ విషయమై సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు స్పం దించి మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

బాలికల స్వీయ రక్షణకు కరాటే ముఖ్యం

● స్లోవేనియా దేశస్థురాలు సైగ


శిక్షకురాలు సైగాను సన్మానిస్తున్న స్థానిక ప్రతినిధులు

తాంసి, ఆగస్టు 25: మండల కేంద్రం సమీపంలో గల ఇండోసాన్ సోగేంజి జెన్‌మనిస్ట్రీ మహాధ్యాన భూమి నందు జెన్ అకాడమీ ఆధ్వర్యంలో నెల రోజులుగా స్లోవేనియా దేశానికి చెందిన ప్రఖ్యాత మాస్టర్ సైగా కరాటే-డూలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. బాలికల స్వీయ రక్షణతో బాలురకు మెళకువలు నేర్పించారు. శిక్షణలో భాగంగా ప్రతిభ కనబరిచిన అనన్య బొంసోడేకు బ్లూ బెల్ట్ సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సైగా మాట్లాడుతూ బాలికల స్వీయ రక్షణకు కరాటే ఎంతో ముఖ్యమన్నారు. ఇందులో జెన్ మాస్టర్ డాక్టర్ సాకు బోధిదమ్మ, లక్ష్మీకాంత్, బాబుసోనులే, తదితరులు పాల్గొన్నారు.

ఒకే ఈతలో ఐదు మేక పిల్లలు



బెల్లంపల్లి, ఆగస్టు 25: మండలంలోని బూదాకలాన్ గ్రామానికి చెందిన ఆవుల అంజి అనే రైతుకు చెందిన మేక ఒకేసారి ఐదు మేక పిల్లలకు జన్మ నిచ్చింది. ఇందులో నాలుగు పోతు పిల్లలు కాగా ఒకటి ఆడ మేక ఉన్నట్లు రైతు తెలిపాడు. మేక పిల్లలు ఆరోగ్యంగా ఉన్నాయన్నాడు. మేక పిల్లలను చూసేందుకు గ్రామస్థులు ఆసక్తి కనబర్చారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



సోగాల శ్రీనివాస్ (ఫైల్)

దండేపల్లి, ఆగస్టు 25: మండలంలోని లింగాపూర్ చెందిన సోగాల శ్రీనివాస్(47) ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. శనివారం సాయంత్రం గ్రామంలో పనులు ముగించుకొని ఇంటికి వచ్చాడు. కాసేపు పడుకుంటానని ఇంట్లో ఉన్న కూలర్ ఆన్ చేసే క్రమంలో కుడి చేతికి విద్యుత్ షాక్ తగిలి కిందపడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం మ్యాదరిపేట ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడని వైద్యులు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కూతురులు ఉన్నారు. మృతుడి భార్య సోగాల వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏస్సై ఉదయ్‌కిరణ్ వెల్లడించారు.

కోతుల దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

జన్నారం, ఆగస్టు 25 : జన్నారం మండలంలోని కవ్వాల గ్రామానికి చెందిన పోలేటి పోచగౌడ్‌పై ఆదివారం కోతులు దాడి చేయగా తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబీకులు వెంటనే జన్నారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం ఇంటి వద్ద పనులు చేస్తుండగా కోతుల గుంపు వచ్చి దాడి చేసింది. దీంతో గాయాలపాలయ్యాడు. కుటుంబీకులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. కాగా కవ్వాలలో కోతుల బెడద ఎక్కువగా ఉందని, దాడులు చేస్తున్నాయని దీంతో భయపడుతన్నామని ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి కాపాడాలని కోరారు.

ప్రమాదకరంగా చెట్ల కొమ్మలు



రహదారికి పైన కిందకు ఉన్న చెట్ల కొమ్మలు

మందమర్రిరూరల్, ఆగస్టు 25 : మండలంలోని బురదగూడెం నుంచి ఊరు మందమర్రికి వెళ్లే దారిలో రోడ్డు పక్కన ఉన్న చెట్ల కొమ్మలు ప్రమాదకరంగా మారాయి. కురుస్తున్న వర్షాలకు, గాలులకు కొమ్మలు విరిగి వాహనదారులపై పడుతున్నాయి. చెట్ల కొమ్మలు గాలికి వంగి కిందకు వేలాడుతున్నాయి. ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

కొమ్మ ఊగిందా.. కరెంటు గోవిందా..

- గాలి, వానొస్తే రాత్రంతా జాగారమే - తరుచూ నిలిచిపోతున్న విద్యుత్ సరఫరా - పట్టించుకోని అధికారులు

కోటపల్లి, ఆగస్టు 25: ఏ చిన్న గాలి వాన వచ్చినా గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. ఒక్కోసారి రాత్రంతా కరెంటు లేక జాగారం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. చిమ్మ చీకట్లు, దోమల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కరెంట్ ఎప్పుడు వస్తుందోననే సమాచారం లేకుండా పోతుంది. యంత్రాంగమంతా పట్టణాలకే పరిమితం కావడంతో పల్లెల్లోని ప్రజల గోస పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

కోటపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రజలు విద్యుత్ కోతతో ఇబ్బందులు పడుతున్నారు. చినుకు పడినా గాలికి కొమ్మ ఊగినా సరఫరా నిలిచిపోతోంది. ఈ నెల 23న రాత్రి ఒక్కసారిగా గాలితో పాటు వర్షం కురవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మరుసటి రోజు ఉదయం కానీ విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేదు. రైసుమిల్లుకు విద్యుత్ సరఫరా చేసే 33/11కేవీ తీగలపై చెట్ల కొమ్మలు పడ్డాయి. 24వ తేదీ రాత్రి సైతం ఇదే పరిస్థితి. గాలి వీచడంతో చెట్ల కొమ్మలు తీగలపై పడడంతో విద్యుత్ నిలిచిపోయింది.

-దోమల తీవ్రత

రాత్రి వేళ విద్యుత్ సరఫరా నిలిచిపోతుండడంతో దోమల తీవ్రత పెరిగింది. కరెంటు లేక ఫ్యాన్‌లు నడవక దోమలు కుట్టడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అసలే వ్యాధుల కాలం ఆపై విద్యుత్ లేకపోవడంతో దోమకాటుకు బలవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు అయితే రాత్రివేళ నిద్రలేక గుక్కపెట్టి ఏడుస్తున్నారని వాపోతున్నారు. అంతేకాకుండా చిమ్మ చీకట్లో విష పురుగుల సంచారం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు లేకపోలేదు.



కోటపల్లి విద్యుత్ ఉపకేంద్రం



కోటపల్లిలో చెట్ల కొమ్మల్లో నుంచి ఉన్న విద్యుత్ తీగలు

-పాత పరికరాలు-ఏపుగా పెరిగిన చెట్లు

తరుచూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడానికి విద్యుత్ స్తంభాలకున్న పాత పరికరాలు, తీగలకు తగులుతూ ఏపుగా పెరుగుతున్న చెట్లే కారణ మవుతున్నాయి. స్తంభాలపై ఉన్న ఇన్సులేటర్లు, ఇతర పరికరాలు పాతవి కావడంతో సమస్య తలెత్తుతోంది. చెట్ల కొమ్మలు కొట్టివేయక పోవడం, అంతర్గత లైన్‌ల కింద ఏపుగా చెట్లు ఉండడంతో గాలి వీస్తే కొమ్మలు విరిగి తీగలపై పడుతున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళ కొమ్మలు పడడంతో తెల్లవారి కొమ్మలు తొలగించిన తర్వాత విద్యుత్ సరఫరా అవుతుంది. దీంతో రాత్రివేళ కరెంటు లేక ఇబ్బందులు తప్పడం లేదు.

-పట్టించుకోని యంత్రాంగం

నిత్యం సమస్య తలెత్తుతున్నా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. విద్యుత్ అధికారులు, సిబ్బంది పట్టణాల్లో ఉంటుండడంతో పల్లె వాసుల కష్టాలు వారికి తెలియడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇందుకు తోడు అసిస్టెంట్ లైన్‌మెన్, జెఎల్ఎం, ఆపరేటర్ల పోస్టులు ఖాళీగా ఉండడం వల్ల సిబ్బంది కొరత ఏర్పడింది. జేఎల్ఎంలు ఇద్దరే ఉండగా, ఇందులో ఒకర్ని సబ్‌స్టేషన్ ఆపరేటర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. అరుగురు ఆపరేటర్లు ఉండాల్సిన చోట ఇద్దరు మాత్రమే ఉన్నారు. విద్యుత్ సరఫరా నిలిచి పోయినప్పుడు సబ్‌స్టేషన్‌కు ఫోన్ పనిచేయడం లేదని, కరెంటు ఎప్పుడు వస్తుందో కనీస సమాచారం తెలియడం లేదని పలువురు వాపోతున్నారు.

సమస్య తలెత్తకుండా చర్యలు

వెంకటేశ్వర్లు, విద్యుత్ ఏఈ

విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం. ట్రీ కటింగ్ చేపడతాం. మెరుపులు, పిడుగుల వల్ల ఇన్సులేటర్లు చెడిపోయినప్పుడు సరఫరా నిలిచిపోతుంది. సిబ్బంది కొరత ఉంది వాస్తవమే. సిగ్నల్స్ లేకపోవడంతో సబ్‌స్టేషన్‌లోని ఫోన్ అప్పుడప్పుడు పనిచేయడం లేదు.

ఏకీకృత సర్వీసు రూల్స్ రూపొందించి పదోన్నతులు కల్పించాలి

ఏసీసీ, ఆగస్టు 25: రాష్ట్ర ప్రభుత్వం ఏకీకృత సర్వీసులు రూపొందించి ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని టీజేఏసీ, పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పర్వతి సత్యనారాయణ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో టీచర్స్‌తో ఫ్రెండ్లీగా ఉంటామని చెప్పిన విధంగా 25 వేల మందికి ప్రమోషన్‌లు, 45 వేల మందికి బదిలీలు కల్పించిందన్నారు. పీఆర్‌టీయూ సూచనల మేరకు కాంగ్రెస్ పార్టీ ఏండ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించిందన్నారు. అయినా కొన్ని సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి వాటిని పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ పునరుద్ధరించాలని, కొత్త పీఆర్‌సీని ప్రకటించాలని, 317 జీవో ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, 13 జిల్లాల్లో భార్యభర్తల బదిలీల సమస్యలను పరిష్కరం, మోడల్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, కేజీబీవీల్లో పనిచేసే బోధనేతర సిబ్బందికి, సర్వశిక్ష అభియాన్‌లో పనిచేసే కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ సిబ్బందికి మినిమం టైం స్కేల్ కల్పించాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధరణి కోట వేణుగోపాల్, సూరినేని గంగాధర్, నాయకులు సంగర్సు రవికాంత్‌రావు, కమటం రామకృష్ణ, లక్ష్మీనారాయణ, సుదీర్‌రావు, ఆడిచెర్ల సాగర్, రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ

నేడు స్మార్త, రేపు వైష్ణవ కృష్ణాష్టమి

మంచిర్యాల, ఆగస్టు 25: కృష్ణుడి జన్మదినాన్ని కృష్ణాష్టమిగా నిర్వహిస్తారు. శైవ సాంప్రదాయపరులు కృష్ణుడు జన్మించిన అష్టమి తిథి ప్రకారం సోమవారం, విష్ణు సాంప్రదాయపరులు రోహిణీ నక్షత్రంతో కూడిన అష్టమి తిథి ప్రకారం మంగళవారం జరుపుకోనున్నారు.

● పండుగను ఇలా జరుపుకోవాలి..

ఇంటిలో కృష్ణుడి పాద ముద్రలను వేసుకోవాలి. పంచామృతాలు, విష్ణు సంబంధ స్తోత్రాలతో అభిషేక, అర్చనలు చేయాలి. ఉపవాసం పాటించాలి. కృష్ణుడిగి ఊరేగించి, ఊయలలో వేసి పాటలు, పద్యాలు, స్తోత్రాలు చదువుతూ పూజించాలి. పాలు, వెన్న, పండ్లు, అటుకులు నైవేద్యంగా సమర్పించి ఉట్టి వేడుకలను నిర్వహించాలి.

● ఆలయాల ముస్తాబు...

సోమ, మంగళ వారాల్లో జరిగే శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా ఆలయాలు ముస్తాబయ్యాయి. సాయినగర్ మురళీకృష్ణ మందిరం, అశోక్‌నగర్ మళయాళ సద్గురు గీతామందిరంతో పాటు నగరంలోని అన్ని ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు. అభిషేక, అర్చనలతోపాటు వేషధారణలు, నైవేద్య సమర్పణలు, భజనలు, జాగరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

మందమర్రిలో కొండచిలువ



కొండ చిలువను పట్టుకున్న స్నేక్ క్యాచర్స్

మందమర్రిటౌన్, ఆగస్టు 25 : పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన తుమ్మ రవీందర్ నివాసంలోని స్టోర్ రూంలో ఆదివారం 11 అడుగుల కొండ చిలువను స్నేక్ క్యాచర్స్ పట్టుకున్నారు. రవీందర్ స్టోర్ రూం తలుపుతీయడంతో కొండ చిలువ కనిపించడంతో స్నేక్ క్యాచర్స్‌కు సమాచారం అందించాడు. కొండ చిలువ ఇంటి పక్కన ఉన్న కాలువలోకి వెళ్లే ప్రయత్నం చేయగా స్నేక్ క్యాచర్స్ పట్టుకున్నారు. గాంధీనగర్‌లో పాముల సంచారం పెరిగిందని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. కొండ చిలువను స్నేక్ క్యాచర్ మహేందర్ అటవీ ప్రాంతంలో వదిలి పెట్టారు.

పాఠశాల అటెండర్‌కు చేయూత

దండేపల్లి,ఆగస్టు 25: రెబ్బనపల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 2005-06 లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు అటెండర్‌గా పని చేసిన శనిగారపు రాజలింగుకు రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. రాజలింగు అనారోగ్యంతో బాధపడుతుండగా సాయం చేసినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్సై ప్రశాంత్

వాంకిడి, ఆగస్టు 25: ఆటోడ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్సై ప్రశాంత్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రోడ్డు నిబంధనలపై కొత్త చట్టాలను అమలు చేస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. ఆటోలలో ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు, అనుమానితులు ఎవరైనా ఉంటే పోలీసుస్టేషన్‌లో సమాచారం అందించాలని ఆయన సూచించారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇన్సురెన్స్, డ్రైవింగ్ లైసెన్సు తప్పకుండా కలిగి ఉండాలని అన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



భూసిమెట్ట పంప్‌హౌస్ ఎదుట ధర్నా చేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు

జైనూర్, ఆగస్టు 25: పెండింగులో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని మిషన్‌భగీరథ కార్మికులు ఆదివారం భూసిమెట్ట పంప్‌హౌస్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఆదర్శ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తమసేవల్ని ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా తయారైందన్నారు. వేతనాలు ఇచ్చేవరకు విధులకు హాజరుకామన్నారు. కార్యక్రమంలో జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల మిషన్ భగీరథ కార్మికులు అడ సిద్దు, ఈశ్వర్, దేవిదాస్, ప్రకాష్, నివర్తి, సురేష్, రమేష్, సందీప్, కాంబ్లే, సత్యవాన్, రవిందర్, విఠల్, ధర్మపాల్, కొడప అంబాజీరావ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి ఏజెన్సీ బంద్‌కు మద్దతు

బెజ్జూరు, ఆగస్టు 25: తుడుందెబ్బ రాష్ట్రకమిటీ బంద్ పిలుపుమేరకు ఈనెల 27న తలపెట్టిన ఏజెన్సీబంద్‌కు మద్దతు ఇస్తున్నట్లు ఆదివాసీ సంఘాలైన కోయసంఘం, కొలవార్(మన్నెవార్) సేవాసంఘం, ఉపాధ్యాయ, నిరుద్యోగ, మహిళసంఘాలు తెలిపాయి. అనంతరం వారు మాట్లాడుతూ ఆదివాసీ సమస్యలు పరిష్కరించాలని బంద్‌తలపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు విశ్వేశ్వర్, శంకర్, తిరుపతి, రమేష్, పుల్లయ్య, ప్రశాంత్, ప్రభాకర్, వినోద్, వెంకటేష్, గిరి, గీత తదితరులు పాల్గొన్నారు.

మంచం పట్టిన కీమానాయక్ తండా

లింగాపూర్, ఆగస్టు 25: మండలంలలోని కిమానాయక్‌తండాలో విషజ్వరాలతో దాదాపుగా 15ఇండ్లలోని ప్రజలు మంచం పట్టారు. మండలకేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు లేకపోవడంతో మండలవాసులకు వైద్యం అందడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి మండల ప్రజలకు వైద్యం అందేలా చూడాలని ప్రజలు వాపోతున్నారు.

ఉపాధ్యాయులు లేక మూతబడిన పాఠశాలలు

కౌటాల, ఆగస్టు 25: ఇటీవల ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడంతో కౌటాలమండలంలో పలు పాఠశాలలు మూతపడ్డాయి. మండలంలోని మొగడ్‌దగడ్ కాంప్లెక్స్‌పరిధిలో 17పాఠశాలలు కొనసాగుతుండగా అందులో 8పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక మూతపడ్డాయి. ఇటీవల కౌన్సెలింగ్ జరగడంతో ఉపాధ్యాయులు బదిలీలు అయి వెళ్లిపోయారు. మండలంలోని మొగడ్‌దగడ్, జనగాం, కన్కి, శివలింగాపూర్‌తోపాటు బూరెపల్లి, హేటిగూడ, గోవింద్‌పూర్, మాడెపల్లి పాఠశాలలు తాళం తెర్చుకోలేదు. గురుడుపేట పాఠశాలలో ఉపాధ్యాయుడిని కేటాయించినప్పటికీ సెలవుపై వెళ్లడంతో ఆ పాఠశాల కూడా మూతపడింది. దీంతో 9పాఠశాలలు మూడు రోజులుగా తాళం తెర్చుకోలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. తమ పిల్లల భవిష్యత్ ఏమవుతుందోనని ఉపాధ్యా యులు బదిలీపై వెళ్తే కనీసం సర్దుబాటు అయినా చేయకపోవడంతో పిల్లల భవిష్యత్ దెబ్బతింటుందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూతపడిన పాఠశాలలు తెరిపించి తమ పిల్లల చదువులు కొనసాగేలా చూడాలని వేడ్కొంటున్నారు.



తాళం వేసిన ఉన్న గురుడుపేటలోని ప్రభుత్వ పాఠశాల

రేపు ఏజెన్సీ బంద్

ఆసిఫాబాద్, ఆగస్టు 25: ఆదివాసీ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల27న తలపెట్టిన ఏజెన్సీ మండలాల బంద్‌ను విజయవంతం చేయాలని తుడుందెబ్బ జిల్లాకన్వీనర్ కోవ విజయ్‌కుమార్ కోరారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని, ప్రత్యేకడీఎస్సీ ఏర్పాటు చేయాలని, జీవోనెం.3ని కొనసాగించాలని, ఐటీడీఏలోని బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, తదితర సమస్యల పరిష్కారానికి ఏజెన్సీ బంద్‌కు పిలుపునిచ్చామన్నారు.

'బంద్‌కు సహకరించాలి'

కెరమెరి, ఆగస్టు 25: ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని ఈనెల27న తలపెట్టిన ఏజెన్సీబంద్‌ను విజయవంతం చేయాలని తుడుందెబ్బ నాయకులు కోరారు. ఐటీడీఏ ద్వారా ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించాలని, బ్లాక్‌లాగ్ పోస్టులను ఆదివాసీలతో భర్తీచేయాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రభాకర్, రాజేశ్వర్,తుకారాం,జగన్నాథ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

రెబ్బెన, ఆగస్టు 25: రెబ్బెన జడ్పీ పాఠశాలలో 1995-96విద్యా సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠాలు బోధించిన గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేతకాని సంక్షేమ సంఘం కమిటీ

జన్నారం, ఆగస్టు 25: పొన్కల్ పట్టణ నేతకాని సంక్షేమసంఘం నూతన కమిటీని ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా బట్టిలక్ష్మణ్, అధ్యక్షులుగా బట్టి వసంత్‌కుమార్, ఉపాధ్యక్షులుగా జాడి రాజన్న, ప్రధానకార్యదర్శిగా బట్టిరవీందర్, కోశాధికారిగా బట్టిశంకర్, సంయుక్త కార్యదర్శిగా బానయ్య, ప్రచారకార్యదర్శిగా సురేందర్, కార్యవర్గ సభ్యులుగా నాగరాజు,గంగన్న,శ్రీనివాస్, లక్ష్మణ్,సత్యనారాయణ, సలహాదారులుగా పెద్దన్న, రాజలింగంలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాజేశ్వర్, ప్రభుదాస్, మండల అధ్యక్షుడు రత్నం లక్ష్మణ్, నాయకులు వెంకట్, గంగన్న, స్వామి, మల్లేష్, నందయ్య, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే పశువులు

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు



రోడ్లపై ఉన్న పశువులు

సిర్పూర్(టి), ఆగస్టు 25: మండలకేంద్రంలో పోలీసుస్టేషన్ నుంచి డౌనల్‌ఏరియా వరకు ఉన్న ప్రధానరహదారిపై పశువులు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. దర్జాగా రోడ్డుపై సేదతీరుతున్నాయి. ఈవిధంగా రోడ్డుపై గుంపులుగా పశువులు తిరుగుతుండడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. పోలీసు స్టేషన్‌నుంచి బస్టాండ్ వరకు ఉన్న ప్రధానరహదారిపై వీధిదీపాలు కూడా లేక పోవడంతో పదిరోజుల్లో నాలుగు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఎలాంటి ప్రమాదాలు జరుగక ముందే అధికారులు స్పందించి పశువులను బంజరుదొడ్లకు తరలించేలా చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు, గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమైన ప్రత్యేకాధికారి సత్యనారాయణను వివరణ కోరగా పశువులు రోడ్లపైకి రాకుండా చర్యలు చేపడుతామన్నారు.

నిరుపేద కుటుంబానికి యూత్‌సభ్యులు చేయూత

దండేపల్లి, ఆగస్టు 25: గూడెం చెందిన మర్రిపల్లి సత్తన్న అనారోగ్యంతో మృతిచెందాడు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో గ్రామానికి చెందిన యూత్ సభ్యులు ఆకుటుంబానికి అండగా ఉండేందుకు ఆదివారం రూ.7500నగదును అందజేశారు. బేర తిరుపతి, జిడ్డిగి రమాకాంత్, అంకటి శ్రీనివాస్, కుసమాల రాకేష్, ఊగ్గే చందు, తాండ్రసాయి, నలిగంటి శేఖర్, మధుకర్ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

బెల్లంపల్లి(తాండూర్), ఆగస్టు 25: తాండూర్‌కు చెందిన పడిద్ద రాజు తల్లి కొద్దిరోజుల క్రితం మృతి చెందడంతో అతని ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో విషయం తెలుసుకున్న తాండూర్ జిల్లాపరిషత్ పాఠశాలలో 1984-85 బ్యాచ్ పదవ తరగతి మిత్రులు ఆదివారం రాజును పరామర్శించారు. రూ. 13 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మిత్రులు ఇలియాస్‌ఖాన్, ఇడిదినేని తిరుపతి, అర్రం శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, నాగలింగు తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిలో..

మందమర్రిటౌన్, ఆగస్టు 25: పట్టణంలోని నార్లాపూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకురాలు బొలిశెట్టి రాధమ్మ ఇటీవల మృతిచెందగా ఆదివారం అఖిల భారత యాదవసంఘం జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్ ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. రూ.8వేల ఆర్థికసహాయం అందించారు. కార్యక్రమంలో పెద్ది రాజన్న తదితరులు పాల్గొన్నారు.

బంద్‌కు పిలుపునిచ్చిన మార్బుల్ అసోసియేషన్

ఏసీసీ, ఆగస్టు 25: మంచిర్యాలజిల్లా ఫాల్‌స్టోన్, మార్బుల్ అసోసియేషన్ ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈనెల 26నుంచి సెప్టెంబరు1 వరకు జిల్లావ్యాప్తంగా మార్బుల్‌పనుల బంద్‌కు పిలుపునిచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మేరుగు శ్రీనివాస్ మాట్లాడుతూ బుక్‌రేటు ప్రకారం పనిచేయాలని, ఇతరరాష్ట్రాల నుంచి వచ్చిన వ్యక్తులు మార్బుల్ పనులు తక్కువ రేట్లకు చేయడంతో స్థానికంగా ఉన్న వారికి పని దొరకడం లేదన్నారు.

మార్బుల్ కార్మికులు, మేస్త్రీలు సంఘం సభ్యత్వం రుసుం చెల్లిం చాలని, జీవితబీమా తీసుకోవాలని కోరారు. 50సంవత్సరాలు నిండిన కార్మికులకు ప్రభుత్వం రూ.5వేల పింఛన్ అమలు చేసేలా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం ప్రధానకార్యదర్శి అబ్దుల్ గని, కోశాధికారి ఇలియాస్, మల్క చంద్రయ్య, మల్లేష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలుగడ్డ, ఉల్లిగడ్డల ధరలు పైపైకి

బెల్లంపల్లి, ఆగస్టు 25: ఆలుగడ్డలు, ఉల్లిగడ్డలు రేట్లు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. మార్కెట్‌లో కిలోఉల్లిగడ్డ ధర రూ.50కి పైనే పలుకుతోంది. ఆలుగడ్డ సైతం కిలో రూ.45నుంచి 50మధ్య ఉంది. 20రోజుల క్రితం ఆలుగడ్డలు, ఉల్లిగడ్డలు రూ.30నుంచి 40ఉండగా ఒక్కసారిగా ధరలు పెరగడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆలుగడ్డలు, ఉల్లిగడ్డలు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవడమే రేట్లు పెరగడానికి కారణమని చెబుతున్నారు. ఉల్లిగడ్డ ధరలు పెరగడంతో బార్ అండ్ రెస్టారెంట్లలో అదనంగా చార్జీలు వసూలు చేస్తున్నారు.

దూరవిద్యతో పైచదువులు

ఉట్నూర్, ఆగస్టు 25: ఉమ్మడిజిల్లాలోని గిరిజన యువతీ, యువకులు పైచదువుల కోసం దూరవిద్య విధానంలో చదువుకోవాలని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ,పోస్టు గ్రాడ్యుయేషన్‌ల కోసం ఆసక్తి ఉన్న వారు బీఆర్ఎస్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంఏ, ఎం కాం, ఎంఎస్‌సీ, బీఎల్ఐఎస్‌సీ, ఎంఎల్ఐఎస్‌సీలలో ప్రవేశాలు ఉంటాయన్నారు. ఈ నెల 31వరకు పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ చేసిన వారు పై చదు వుల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9010295910, 9666748105 లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ట్రేడ్ యూనియన్.. ఎన్నికలకు కసరత్తు



ఎన్నికలకు దారితీసిన పరిస్థితులివే..

మిల్లు పునరుద్ధరణ తర్వాత అప్పటి ప్రభుత్వం యాజమాన్యానికి చాలా రాయితీలిచ్చింది. ఎన్‌సీఎల్టీ కోర్టు నుంచి వచ్చిన నిధులెన్ని..? ఇందులో కార్మికులకు దక్కినదెంత..? అనే కోణంలో రాష్ట్ర స్థాయి లేబర్ అధికారులు విచారణ చేపట్టాలని కార్మికులు డిమాండు చేస్తున్నారు. కార్మికుల జీతాలతో నెలవారీగా ఏర్పాటు చేసుకున్న సొసైటీ డబ్బులు కూడా పక్కదారి పట్టాయి. కోట్ల నిధులు దారి మళ్లించినట్లు ఆరోపణలు రాగా ఇంతవరకు విచారణ జరగలేదు. రిటైర్ అవుతున్న కార్మికుల్లో ఇప్పటికీ సొసైటీ డబ్బులు కోతవిధిస్తున్నారు. అప్పటి ప్రభుత్వం ఈప్రాంత కార్మికులకు న్యాయం జరుగుతుందన్న ఉద్దేశ్యంతో మిల్లును పునః ప్రారంభించింది. కానీ జేకే యాజమాన్యం స్థానికులను, ఈ ప్రాంత కార్మికులను ఇప్పటికీ పూర్తిగా విధుల్లోకి తీసుకోలేదు. పైగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు, ఉద్యోగులతో వివిధ డిపార్టుమెంట్లలో పనులు చేయిస్తున్నారు. వీరికి అధికంగా జీతాలిస్తున్నారు. మిల్లులో యాజమాన్యం కూడా కార్మికులపై పనిభారం, ఒత్తిడి, న్యాయపరమైన రావాల్సిన బోనస్ చెల్లింపులు ఏ మాత్రం చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని ఆయా ట్రేడ్‌యూనియన్ నాయకులు పేర్కొంటున్నారు. మిల్లులో అధికార గుర్తింపుసంఘం, ట్రేడ్‌యూనియన్ సంఘాల కార్యకలాపాలు పూర్తిస్థాయిలో లేకుండా పోయాయి. దీంతో సమస్యలు పరిష్కరించే మార్గం కావాలంటే ట్రేడ్ యూనియన్ ఎన్నికలు జరపాలని కార్మికులు డిమాండు చేస్తున్నారు.



- ఎస్పీఎంలో రంగంలోకి దిగిన కార్మిక అధికారులు
- గుర్తింపు సంఘాల జాబితాను అందజేయాలని నోటీసులు
- త్వరలోనే కార్మికసంఘాల సమావేశం

కాగజ్‌నగర్ టౌన్, ఆగస్టు 25: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఎస్పీఎం ట్రేడ్ యూనియన్ ఎన్నికలకు ఎట్టకేలకు కార్మికశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. 2014లో మిల్లు మూతబడిన తర్వాత ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. 2018లో పునరుద్ధరణ జరిగిన తర్వాత కూడా కొత్తగా టేకోవర్ చేసిన జేకే యాజమాన్యం కూడా ట్రేడ్ యూనియన్ ఎన్నికలపై ఎలాంటి ముందడుగు వేయలేదు. యాజమాన్యం కార్మికుల హక్కులను కాలరాస్తోందని, అలాగే స్థానికేతరులకు ఎక్కువ, స్థానికులకు తక్కువ జీతాలు ఇచ్చి వ్యత్యాసం చూపిస్తోందని పలువురు మండిపడుతున్నారు. మిల్లులో ప్రమాదాలు జరిగిన సమయంలో కార్మికులు మృతిచెందితే న్యాయపరంగా రావాల్సిన బెనిఫిట్స్ కూడా ఇవ్వకుండా తప్పించుకొనే విధంగా యాజమాన్యం వ్యవహరిస్తోందని కార్మికులు యాజమాన్యంపై గుర్రుగా ఉన్నారు. ఎస్పీఎంలో ఎన్నికలు నిర్వహించాలని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు కొంగ సత్యనారాయణ రెండు నెలల క్రితం లేబర్ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అలాగే నాలుగు రోజుల క్రితం కూడా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రాష్ట్ర కార్మిక అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు నేపథ్యంలో మిల్లులో ఎన్ని సంఘాలున్నాయి..? వారి అధికార రిజిస్ట్రేషన్ పత్రాలను వచ్చేనెల3లోగా ఆదిలాబాద్ కార్మిక శాఖ కార్యాలయంలో సమర్పించాలని రాష్ట్ర కార్మిక అధికారి నోటీసులను జారీ చేశారు. దీంతో మిల్లులో ఉన్న ఆయా ట్రేడ్‌యూనియన్ సంఘల నాయకులు తమ రిజిస్ట్రేషన్ పత్రాలను సమర్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కార్మికులకు అన్యాయం జరుగుతోంది..

-డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు



ఎస్పీఎంలో యాజమాన్యం కార్మికులను శ్రమ దోపిడీ చేస్తోంది. మిల్లు పునరుద్ధరణ జరిగిన తర్వాత ఎన్‌సీఎల్‌టీ కోర్టు నుంచి వచ్చిన నిధులు..? కార్మికులకు రావాల్సిన డబ్బుల విషయంపై విచారణ జరపాలి. జీతాల విషయంలో కార్మికుల మధ్య యాజమాన్యం అసమానతలను సృష్టించింది. స్థానికులకు తక్కువ, స్థానికేతరులకు ఎక్కువ జీతాలిస్తోంది. చాలా దుర్భరమైన స్థితిలో కార్మికులు కాలం గడుపుతున్నారు. మిల్లులో ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర కార్మికశాఖ అధికారులను స్వయంగా కలిశాను. మిల్లులో జరుగుతున్న పరిస్థితులను కూడా వివరించారు. త్వరలోనే ఎన్నికలు జరిపేందుకు అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చారు.

పులి కోసం ముమ్మరంగా గాలింపు



కెరమెరి అడవుల్లో పులి కోసం గాలిస్తున్న అటవీ అధికారులు

కెరమెరి, ఆగస్టు 25: మండలంలోని ఉమ్రిగ్రామ సమీపంలో పత్తిచేనుల్లో పులిఅడుగులను గుర్తించిన అటవీశాఖాధికారులు ఆదివారం పులికోసం ముమ్మరంగా గాలించారు. ఆదివారం ఇందాపూర్, ఆగర్‌గూడ, ఉమ్రి, నాగల్‌గొంది గ్రామాల్లో పత్తిచేనుల్లో, అడవుల్లో గాలించినట్లు ఎఫ్ఆర్వో మజారోద్దీన్ తెలిపారు. ఈ ప్రాంతంలో గుట్టలు, బండరాళ్ల మధ్య పాదముద్రలు లభ్యమవడం కష్టంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కాగా ఆగర్‌వాడ, ఉమ్రి అడవుల్లో ఆదివారం పులి గాండ్రింపు వినిపించినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి మరో పోరాటానికి సిద్ధం కావాలి

- ఆర్టీసీ ఈయూ డిపో కార్యదర్శి దివాకర్



మాట్లాడుతున్న ఆర్టీసీ ఈయూ నాయకులు

ఆసిఫాబాద్, ఆగస్టు 25: కార్మికుల సమస్యల పరిష్కరిం చేందుకు మరో పోరాటానికి సిద్ధం కావాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి దివాకర్ అన్నారు. ఆదివారం ఆర్టీసీడిపో గేటు ఎదుట సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్నారు. 2013 సంవత్సరం బాండ్ల డబ్బులు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న రెండు పీఆర్సీలను వెంటనే అమలు చేయాలన్నారు. వెల్ఫేర్ బోర్డులను రద్దుచేసి ట్రేడ్‌యూనియన్ పునరుద్ధరించాలని, తదితర సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 27న నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన, సెప్టెంబరు 10న డిమాండ్ డే, అక్టోబరు1న ఇందిరా పార్కు వద్ద సామూహిక నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, శంకర్, చిరంజీవి, సురేష్, సులేమాన్, ఎజాజ్, ఉమేష్, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల్లోకి పెరిగిన వరద

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 25: ఏజెన్సీ మండలాల్లో శుక్ర, శనివారాల్లో భారీ వర్షాలు నమోదు కావడంతో మండలంలో వట్టివాగు, కుమరం భీం ప్రాజెక్టులకు వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు ప్రాజెక్టుల గేట్లు పైకి ఎత్తి నీటిని కిందికి వదులుతున్నారు. కుమరంభీం ప్రాజెక్టు నీటి మట్టం 243మీటర్లు కాగా 237.7మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టులో 745క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండడంతో రెండు గేట్లుఎత్తి 784క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. అలాగే వట్టివాగు నీటిమట్టం 239.5కాగా 238.9మీటర్లకు చేరుకుంది. దీంతో 3500క్యూసెక్కుల వరద నీరువచ్చి చేరుతుండడంతో రెండుగేట్లు ఎత్తి3600 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. దీంతో ప్రాజెక్టు పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రజలకు సూచించారు.

సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

కాగజ్‌నగర్, ఆగస్టు 25: బీజేపీ ఆధ్వర్యంలో వచ్చే నెల1 నుంచి చేపట్టే పార్టీ సభ్యత్వ నమోదు పండుగను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు తెలిపారు. ఆదివారం స్థానికంగా ఆయన మాట్లాడారు. సాధారణ సభ్యత్వ నమోదు కార్యక్రమం సెప్టెంబరులో ఉంటుందన్నారు. అలాగే అక్టోబరులో క్రియాశీల సభ్యత్వనమోదు కార్యక్రమాలు చేపట్టాలని కార్యకర్తలకు సూచించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పెద్దఎత్తున చేర్పించాలని కోరారు. కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి అంతా కృషిచేయాలన్నారు. ప్రతిగడప గడపకూ బీజేపీ సభ్యత్వం చేర్చేట్టు చూడాలన్నారు. కార్యక్రమంలో మాజీజడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, బాజపా జిల్లా ప్రధానకార్యదర్శి దోని శ్రీశైలం, అసెంబ్లీ కన్వీనర్ వీరభద్రుఆరి, సొల్లు లక్ష్మీ, కొలిపాక కిరన్, కృష్ణకుమారి, మలిక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గోలి మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

పెరుగుతున్న సైబర్ నేరాలు

- నకిలీ వీదేశీయాప్‌లతో మోసాలు
- డబ్బులు పెట్టాలని ఆకర్షణీయమైన ప్రకటనలు
- రూ.లక్షలు మోసపోతున్న బాధితులు



కాగజ్‌నగర్, ఆగస్టు 25: ఒక్క రోజులోనే డబ్బులు రెండింతలు... మూడింతలంటూ ఆన్‌లైన్ ప్రకటనలు చేస్తూ సైబర్‌నేరగాళ్లు వీదేశీ(వీసీఐ)యాప్‌లతో సామాన్యులను మోసగిస్తున్నారు. యాప్‌లను డౌన్ లోడ్ చేసుకోవాలని స్మార్ట్‌ఫోన్‌కు లింకులు పంపిస్తు న్నారు. ఈ యాప్‌ల్లో ప్రధానంగా వీసీఐ, రోబోటిక్స్, ఏఐ, డేటా ప్రోడక్ట్ పేరిట ప్రకటనలు ఇస్తున్నారు. వీటిని క్లిక్‌చేయగానే యాప్ డౌన్‌లోడ్ అవుతుంది. ఆ తర్వాత మీరు పెట్టుబడులు పెట్టే డబ్బుల వివరాల తాలుకూ విషయాలను ఆకర్షణీయంగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ యాప్‌లో రూ.500 పెట్టుబడితే సాయంత్రం వరకు రూ.1000 వచ్చే అవకాశాలున్నాయని, నచ్చకపోతే మీ డబ్బులను వెంటనే విత్‌డ్రా చేసుకోవచ్చని సూచిస్తున్నారు. డబ్బులు సంపాదించినట్లుగా ఫేక్ వీడియోలను చూపుతన్నారు. వాటిని చూసిన అమాయక ప్రజలు ఆశపడి వేల రూపాయలు పెట్టుబడులు పెడుతున్నారు. ఒకరితో అలా చేయించడమే కాకుండా గొలుసు కట్టులాగా మీరు మరో25 మందికి పంపించి డబ్బులు పెట్టుబడులు చేయిస్తే రూ.100నుంచి రూ.500ల వరకు అదనంగా డబ్బులు సంపాదించుకునే అవకాశం ఉందని ఊరిస్తున్నారు. వీటిని నమ్మి అమాయక ప్రజలు పెట్టుబడులు పెడుతున్నారు. సాయంత్రం వరకు డబ్బులు రెట్టింపు అయినట్లుగా ఫోన్ యాప్‌లో కనిపిస్తున్నాయి. అయితే విత్‌డ్రా చేసుకునే మార్గం కనిపించక ఇబ్బంది పడుతున్నారు. యాప్ నిర్వాహకులను సంప్రదిస్తే ఫోన్ కలవదు. కొద్ది సేపటికే యాప్‌లో ఉన్న డబ్బులు కనిపించవు. దీంతో డబ్బులు పెట్టిన అమాయక ప్రజలు తాము మోసపోయినట్టుగా తెలుసుకుంటున్నారు. ఈ విధంగా సిర్పూరు నియోజకవర్గంలో సిర్పూరు(టి), కౌటాల, బెజ్జూరు, పెంచికల్‌పేట, దహెగాం మండలాల నుంచి చిరువ్యాపారులు, గ్రామీణప్రాంత యువకులు, ఉద్యో గులు ఇలా దాదాపు 1200మందికి పైగా పెట్టుబడులు పెట్టి మోసపోయినట్లు సమాచారం. బయటకు చెప్పుకుందామంటే పరువు పోతుందని లోలోనే మదనపడు తున్నారు. పోలీసులు, అధికారులు తరచూ సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నా కొందరి తీరు మారడం లేదు.

క్షేత్ర స్థాయి పర్యటనలో ట్రైనీ ఎఫ్ఆర్వోలు



పెంచికలపేట అటవీ ప్రాంతాన్ని సందర్శిస్తున్న ట్రైనీ ఎఫ్ఆర్వోలు

పెంచికలపేట, ఆగస్టు 25: పెంచికపేట రేంజ్‌పరిధి లోని అటవీప్రాంతాన్ని ఆదివారం దూలపల్లిలో అటవీ శిక్షణకేంద్రంలో శిక్షణపొందుతున్న 11వబ్యాచ్ ఎఫ్‌ఆ ర్వోలు క్షేత్రస్థాయి పర్యటనచేశారు. ఈపర్యటనలో భాగంగా కొండపల్లి, లోడ్‌పల్లి మధ్యగల ప్రాణహిత ప్రాజెక్టు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అలాగే గుండెపల్లి బీట్‌పరిధిలోని జీపబుల్‌రోడ్డు, గడ్డి క్షేత్రాలు, వృక్షజాతులను పరిశీలించారు. రేంజ్‌పరిధిలో ఉన్న జంతు,వృక్ష,అటవీవిస్తీర్ణం, భౌగోళిక అంశాలపై ఎఫ్ఆర్వో అనీల్‌కుమార్ వారికి వివరించారు. కార్యక్రమంలో శిక్షణా కేంద్రం కోర్స్ డైరెక్టర్ డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీపూర్‌లో వైద్యశిబిరం

వాంకిడి, ఆగస్టు 25: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో ఆదివారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వ హించారు. ఈసందర్భంగా ప్రజలు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జ్వరాలతో బాధపడుతున్న వారినుంచి రక్తనమునాలు సేకరించారు. వర్షాకాలంలో తీసుకోవా ల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత, పరిసరాల పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఈవో రవిదాస్, సిబ్బంది ప్రమోద్, ఆశావర్కర్ పుష్ప, తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



28నుంచి వార్షిక క్రీడా పోటీలు

శ్రీరాంపూర్, ఆగస్టు 25: శ్రీరాంపూర్‌లోని ప్రగతిమైదానంలో ఈనెల 28నుంచి వార్షిక క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరాంపూర్ గ్రూప్‌లో ఎస్ఆర్‌పీ1, ఎస్ఆర్‌పీ3, 3ఏ, ఐకే-1ఏ, ఐకే ఓసీపీ, ఆర్‌కె-1 గ్రూప్‌లో ఆర్‌కే5,6, సీహెచ్‌పీ, ఆర్‌కే-2 గ్రూప్‌లో ఆర్‌కే-7, ఆర్‌కే-న్యూటెక్, అదర్స్‌గ్రూప్‌లో శ్రీరాంపూర్ ఓసీపీ, ఇతరవిభాగాలు, ఎస్‌టీపీపీ ఉద్యోగులు ఉంటారన్నారు. ఆయాగ్రూపులకు 28న వాలీబాల్, 29న బాస్కెట్ బాల్, 30న ఫుట్‌బాల్, 31న, సెప్టెంబర్ 1న క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్స్, 2న హాకీ, 4న బాల్‌బ్యాడ్మింటన్, 4నకబడ్డీ, 5నలాన్‌టెన్నిస్, 6నఅథ్లెటిక్స్(మహిళలు,పురుషులు), త్రోబాల్ (మహిళలు), స్విమ్మింగ్(పురుషులు), 8న బాడీబిల్డింగ్, వెయిట్‌లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్, కల్చరల్ పోటీలుంటాయని, ఉద్యోగులు తమపేర్లు నమోదు చేసుకొని ఉత్సాహంగా పాల్గొనాలని ఆయన కోరారు.

జిల్లాలో మోస్తరు వర్షం

ఆసిఫాబాద్, ఆగస్టు 25: జిల్లాలో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆసిఫా బాద్, సిర్పూర్ (టి) మండలాల్లో ఓ మోస్తరు నుంచి తేలికపాటి వర్షం పడింది. గడిచిన 24గంటల్లో జిల్లాలోని బెజ్జూర్ మండలంలో 47.8మిల్లీ మీటర్లు, పెంచికల్‌పేటలో 42.8, దహెగాంలో 38.3, చింతలమానేపల్లిలో 32.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో కురుస్తున్న వర్షాలకు కుమరంభీం, వట్టివాగు ప్రాజెక్టులలోకి వరదనీరు వచ్చి చేరడంతో ఆయా ప్రాజెక్టుల రెండేసి గేట్లను ఎత్తి వరద నీటిని కిందికి వదులుతున్నారు.



సిర్పూర్(టి)లో కురుస్తున్న వర్షం

సిర్పూర్(టి)లో వర్షం..

సిర్పూర్(టి): మండలకేంద్రంలో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. మూడు నాలుగు రోజులుగా మండలంలో ఉదయం నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఎండ ఉంటుండగా ఆ తరువాత ఆకాశం మేఘావృతమైన వర్షం కురుస్తోంది.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

దహెగాం, ఆగస్టు 25: జూలై 8న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో గాయపడిన దహెగాం మండలం గిరివెల్లి గ్రామానికి చెందిన శంకర్ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..దహెగాం మండలం మర్రిపల్లి స్టేజీవద్ద గతనెల 8న రెండు ద్విచక్రవాహనాలు ఢీన్నాయి. ఈ ప్రమాదంలో గిరివెల్లికి చెందిన శంకర్ తీవ్రంగా గాయపడగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గాయాలు తగ్గకపోవంతో శనివారం స్వగ్రామానికి తీసుకు రాగా ఆదివారం మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు.

పూలాజీ బాబా జయంతి పోస్టర్ల ఆవిష్కరణ

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 25: జైనూరు మండలం పాట్నాపూర్‌లో ఈనెల30న జరుగనున్న పూలాజీబాబా శతజయంతి వేడుకలకు సంబంధించిన పోస్టర్లను పూలాజీ బాబా కుమారుడు వామన్ రావు, సింగిల్‌విండో చైర్మన్ అలీబీన్ అహ్మద్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దఎత్తున ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, భీమేష్, రమేష్, శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా బీపీ మండల్ జయంతి

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 25: బీసీవర్గాల ఆరాధ్య దైవం బీపీ మండల్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ కుమార్ మాట్లాడుతూ బీసీవర్గాల ప్రజల కోసం, రిజర్వేషన్లకై బీపీ మండల్ ఎన్నో ఉద్యమాలు చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు సాగర్, ప్రశాంత్ తది తరులు పాల్గొన్నారు.

'పాఠశాలకు ప్రహరీ నిర్మించాలి'

లింగాపూర్, ఆగస్టు 25: మండలకేంద్రంలో గల జిల్లా పరిషత్ పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు వారి పోషకులు కోరుతున్నారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో ఆవరణలో పశువులు తిరుగుతున్నాయన్నారు. అంతేగాక నాటిన మొక్క లను తింటున్నాయన్నారు. రాత్రిళ్ల వరండా మందు బాబుల అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారు తోందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రహరీ మంజూరు చేయాలన్నారు.

పురుగులమందు తాగి ఇద్దరి ఆత్మహత్య

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 25: వేర్వేరు ఘటనల్లో పురుగుల మందు తాగి ఇద్దరు ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు ఆదివారం ఆసిఫాబాద్ మండలంలో చోటుచేసుకున్నాయి. ఆసిఫాబాద్ మండలంలోని అంకుశాపూర్ గ్రామానికి చెందిన కవాల్కర్ బాబురావు(42) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజేశ్వర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బాబురావు కూలి పనులకు వెళుతూ ఉంటాడు. కుటుంబీకులు వ్యవ సాయ పనులకు రావాలని కోరగా అందుకు బాబూరావు నిరాకరించాడు. ఆదివారం కుటుంబీకులు వ్యవసాయ పను లకు వెళ్లగా బాబూరావు మండలంలోని గూడెన్‌ఘాట్ సమీపంలో పురుగులమందు తాగాడు. అనంతరం అతడు బంధువైన గోవింద్‌కు ఈవిషయం తెలిపాడు. దీంతో గోవింద్ కుటుంబీకులకు సమాచారం ఇవ్వగా గూడెన్‌ఘాట్ సమీ పంలో గాలించగా అపస్మారక స్థితిలో ఉన్న బాబురావును గుర్తించి ఆసిఫాబాద్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ అతడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుడు నిఖిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అదేవిధంగా మరో ఘటనలో మండలంలోని ఇప్పల్‌నవేగాం గ్రామానికి చెందిన దసరవాడ దొండిబా(66) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజేశ్వర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొన్నిరోజులుగా దొండిబా మద్యానికి బానిసయ్యాడు. చేనులో కూలిపనికి వెళ్లగా అక్కడ ఉన్న పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన సమీప పంట చేనుల్లోని వారు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. దీంతో కుటుంబీకులు అక్కడికి చేరుకొని అతన్ని ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మంచిర్యాలకు తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందాడు. కుమారుడు చంద్రబాను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జనావాసాల్లోకి నీలుగాయి

బెజ్జూరు, ఆగస్టు 25: దారితప్పిన నీలుగాయి జనావాసాల్లోకి వచ్చింది. ఆదివారం బెజ్జూరు మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్ సమీపంలో నీలుగాయి వచ్చిన విషయం స్థానికులు గమనించి అటవీ శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. నీలుగాయిని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అది కాస్త వైరల్‌గా మారడంతో అటవీరేంజ్ అధికారి లక్ష్మీనారాయణ, డిప్యూటీరేంజర్ శ్రావణ్ నీలుగాయి సంచరించిన ప్రదేశాన్ని గుర్తించి సిబ్బందితో కలిసి అటవీ ప్రాంతానికి వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.